భోజనం.. ఉద్యోగార్థులకు ఊరట

- గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు పుస్తకాలతో నిరుద్యోగుల కుస్తీ


జిల్లా గ్రంథాలయంలో మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్

కామారెడ్డి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. దీంతో ఉద్యోగాల సాధనకు నిరుద్యోగులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఎలాగైనా ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో యువకులు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాల తో కుస్తీ పడుతున్నారు. ఉద్యోగం సాధించడమే ఏకైక లక్ష్యంగా కొందరు నిరుద్యోగులు భోజనం చేసేందుకు కూడా ఇళ్లకు వెళ్లకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి చదువుకుంటున్నారు. దీంతో మధ్యాహ్న సమయంలో భోజనం ఏర్పాటు చేస్తే వారికి మరింత వెసులుబాటు ఉంటుందనే ఉద్దేశంతో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ ఎంకే ముజీబొద్దీన్ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయానికి జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది నిరుద్యోగులు వచ్చి పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారన్నారు. వారికి ఇబ్బందులు కలుగకుండా ఉండటానికి మధ్యాహ్న భోజన సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. భోజన వసతితో పాటు గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఏసీ సౌకర్యాన్ని సద్వినియోగం చే సుకొని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి.రాజేశ్వర్ ఇప్పటికే సూచించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పిరి వెంకట్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందుప్రియ, చంద్రశేఖర్ రెడ్డి, హఫీజ్, గెరిగంటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత


నిత్యావసర వస్తువులు అందజేస్తున్న కురుమ చైతన్య సమితి నాయకులు

భిక్కనూరు: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి పలువురు ముందుకు వచ్చి చేయూత అందించారు. మండల కేంద్రానికి చెందిన సాయి హన్‌మాన్ సేవా సమితి ప్రతినిధులు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, సర్పంచ్ తున్కి వేణు మూడు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు, దుస్తులు, కురుమ చైతన్య సమితి ఆధ్వర్యంలో నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో సాయి హన్‌మాన్ సేవా సమితి ప్రతినిధులు కొండూరి శ్రీనివాస్, బోండుగుల రవీందర్, సర్పంచ్ తున్కి వేణు, ఉప సర్పంచ్ బోడ నరేశ్, కుర్మ చైతన్య సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అంబల్ల సాయి నిఖిల్, ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల స్వామి, కార్యదర్శి కందూరి రాకేషు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం


వెల్లుట్లలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిరూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి బీజేపీ నాయకులు మండలంలోని వెల్లుట్ల, వెల్లుట్లపేట, వెంకటాపూర్ గ్రామాలలో ఇంటింట వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు బైండ్ల పోచయ్య, మల్లేష్ తదితరులు ఉన్నారు.


కామారెడ్డిలో ఇంటింటా ప్రచారం చేస్తూ..

కామారెడ్డి టౌన్: కేంద్రం అమలు చేస్తున్న వివిధ పథకాలను బీజేపీ, ఓబీసీ మోర్చా నాయకులు శనివారం కామారెడ్డిలో ఇంటింటా వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడెం శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రమేష్, మాజీ కౌన్సిలర్ జూలూరి సుధాకర్, నాయకులు నరేష్, శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హోటల్‌లో చోరీ

- రూ. 20 వేల విలువైన వస్తువుల అపహరణ

మాచారెడ్డి : మండలంలోని పాల్వంచ మర్రి వద్ద ఉన్న సాయిచరన్ హోటల్ తాళాలు బద్దలు కొట్టిన దుండగులు రూ. 20 వేల విలువైన వస్తువులు అపహరించారు. మాచారెడ్డి ఎస్సై సంతోశ్ తెలిపిన వివరాల ప్రకారం పాల్వంచ మర్రి వద్ద ఉన్న హోటల్ యజమాని జ్ఞానేశ్వర్ శుక్రవారం రాత్రి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. అదను చూసి దుండగులు తాళాలు పగులగొట్టి సీసీ కెమెరా మానిటర్, గ్యాస్ స్టౌ, సిలిండర్ తదితర విలువైన వస్తువులను అపహరించినట్లు ఎస్సై వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైకుంఠధామం పనులు వేగవంతం చేయాలి



ఎల్లారెడ్డిరూరల్: వైకుంఠధామం పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సిబ్బందికి సూచించారు. రూ. 2 కోట్లతో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులను శనివారం ఆయన పరిశీలించారు.

బడిఈడు పిల్లలు బయట..



నస్రుల్లాబాద్: బడిలో ఉండాల్సిన బాలలు కార్మికులుగా మారారు. మండలంలోని నెమ్లి గ్రామంలో ఇద్దరు చిన్నారులు వీధుల్లో తిరుగుతూ ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వస్తువులను ఏరుకుంటూ కన్పిస్తున్నారు. ఎక్కడి నుంచి వచ్చారని వారిని స్థానికులు ప్రశ్నించగా బాన్సువాడ నుంచి వచ్చినట్లు తెలిపారు.

క్రైస్తవుల ర్యాలీ



ఎల్లారెడ్డి: క్రైస్తవులు శనివారం ఎల్లారెడ్డిలో ర్యాలీ నిర్వహించారు. గుడ్ ఫ్రై డే కార్యక్రమంలో భాగంగా రన్ ఫైట్ జీసస్ ర్యాలీ కార్యక్రమాన్ని ఫాదర్ జోసఫ్ ప్రారంభించారు. సీఎస్ఐ చర్చి నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీగా వెళ్లారు. సాల్మాన్, రాజశేఖర్, ఇమాన్యుయేల్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి



నిజాంసాగర్: మహిళల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారని మంగ్లూర్ సర్పంచ్ గైని స్వప్న అన్నారు. శనివారం మండలంలోని మంగ్లూర్‌లో 16 స్వయం సహాయక సంఘాలకు రూ.4. 83 లక్షల విలువ చేసే పావలా వడ్డీ మాఫీ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు సుబ్బురి మంజుల తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వంట పాత్రల పంపిణీ



రాజంపేట: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రాజంపేట, పెద్దాయిపల్లి, శివాయిపల్లి గ్రామాల్లో ఆర్థికంగా వెనుకబడిన పేదలకు వంట పాత్రలకు సంబంధించి కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు, డివిజన్ సెక్రటరీ జమీల్, ఐఆర్‌సీఎస్ చైర్మన్ డాక్టర్ హరినాథ్, చెన్నబోయిన ప్రసాద్, సర్పంచ్‌లు విఠల్‌రెడ్డి, శివలక్ష్మి పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



బాన్సువాడ టౌన్: బాన్సువాడ పట్టణంలో శనివారం పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఎంపిక చేసిన బస్తీలు, కాలనీలలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందంతో కవాతు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ మ హేందర్ రెడ్డి, ఎస్సై రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని ఇచ్చిన హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు

కామారెడ్డి టౌన్: రాష్ట్రానికి ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు వెంకటిగౌడ్, దశరత్ డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మరచిపోయారని ఆరోపించారు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని చెప్పినా వాటి గురించి పట్టించుకోలేదన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమకు నిధులూ కేటాయించలేదన్నారు. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు ఊసే లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోతిరాం నాయక్, బాలరాజు, నర్సింలు, రాజయ్య, శివకుమార్, సాయిలు పాల్గొన్నారు.

రోడ్లకు ఇరువైపులా వడ్లు ఆరబోయవద్దు


రైతులతో మాట్లాడుతున్న ఎస్సై రంజిత్ రెడ్డి

నస్రుల్లాబాద్: రోడ్లకు ఇరువైపులా వడ్లు ఆరబోయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై రంజిత్‌రెడ్డి రైతులకు సూచించారు. శనివారం మండలంలోని అంకోల్ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. వరి ధాన్యం కుప్పల వద్ద రాళ్లు ఉంచొద్దన్నారు. కుప్పలు వాహనదారులకు కన్పించేలా వాటిపై తెల్లటి పేపర్లు లేదా వస్త్రాలు కప్పాలన్నారు. ఆయన వెంట అంకోల్ సర్పంచ్ బొస్సోల్ల సాయిలు, అంకోల్ తండా సర్పంచ్ బద్య నాయక్ ఉన్నారు.

వేగంగా ఇళ్ల నిర్మాణాలు


బోరుమోటారును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామంలో చేపడుతున్న డబుల్ బెడ్రూంఇళ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నట్లు బాన్సువాడ డివిజన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి కృషితో గ్రామంలో ఇప్పటికే 100 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. బీడీ వర్కర్స్ కాలనీలో ఇళ్ల నిర్మాణాల కోసం నీటిని సరఫరా చేసేందుకు బోరుబావికి మోటార్‌ను అమర్చారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు అరీఫాబేగం, అర్షద్ ఖాన్, మందసాయిలు, హన్మాగౌడ్, హన్ను, శేఖర్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ దశరథ్‌రెడ్డి

రామారెడ్డి: పాడి రైతులను ప్రోత్సహించేందుకు పాల ధరలను పెంచినందుకు ఎంపీపీ దశరథ్‌రెడ్డి శనివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి రైతులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. కాగా పోసానిపేట సర్పంచ్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రెండేళ్ల కిందట లీటరు పాలుకు రూ. 4 ప్రకారం ధర పెంచుతామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినా ఇప్పటికీ అమలు చేయలేదని ఆరోపించారు. పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని లేకుంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని వెల్లడించారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం


కామిశెట్టి పల్లిలో మాట్లాడుతున్న పెర్క శ్రీనివాస్

నస్రుల్లాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని కామిశెట్టి పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ మెంబర్ మాజీద్ ఖాన్, నాయకులు రాము,సాయాగౌడ్, వెంకటి పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభ్యత్వ కార్డుల పంపిణీ



సదాశివనగర్: కాంగ్రెస్ సభ్యత్వం తీసుకున్న పలువురికి ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య శనివారం సభ్యత్వ కార్డులను అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన తలారి సాయిలు అనే కార్యకర్త మృతి చెందడంతో నియోజకవర్గం ఇన్‌చార్జి వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ. 2లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనగామ రాజు, గాదారి నర్సారెడ్డి, జగ్గ స్వరూప, లింగారెడ్డి, రాజయ్య, జగ్గ బాల్‌రాజు, ప్రభుస్వామి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోరు..


బీర్కూర్‌లో కుస్తీ పడుతున్న మల్లయోధులు


బూర్గుల్‌లో తలపడుతున్న కుస్తీ వీరులు

నిజాంసాగర్: మత్తడి పోచమ్మ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బూర్గుల్ గ్రామంలో నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. విజయం సాధించిన వారికి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కుస్తీ పోటీల నిర్వాహకులు మనీష్‌రెడ్డి, విఠల్ రెడ్డి, బాస్కర్‌రెడ్డి, బల్‌రాం, రాములు, జీవన్, అంజనేయులు, అబ్జల్, సాయాగౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్(బీర్కూర్): గజ్జెలమ్మ జాతరను పురస్కరించుకుని బీర్కూర్‌లో శనివారం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో విజయం సాధించిన వారికి నిర్వాహకులు బహుమతులను అందించారు.


బూర్గుల్‌లో విజేతకు నగదు బహుమతి..

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


తాడ్కోల్‌లో చెక్కు పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్


అన్నాసాగర్‌లో..

బాన్సువాడ రూరల్: సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద మంజూరైన చెక్కులను మండలంలోని తాడ్కోల్ గ్రామంలో శనివారం బుడిమి సొసైటీ చైర్మన్ గంగుల గంగారాం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, కుమ్మరి రాజు, నూకల రాజు, లక్ష్మణ్‌గౌడ్, రాజిరెడ్డి, రామ్‌రెడ్డి, జనార్థన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ నాగరాజు పలువురి లబ్ధిదారులకు అందజేశారు.

కార్మికుల రక్షణకు సేఫ్టీ పరికరాలు ఏవీ?


ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు

భిక్కనూరు: కార్మికుల రక్షణ కోసం అవసరమైన సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొత్త నర్సింలు డిమాండ్ చేశారు. మండలంలోని జంగంపల్లి వద్ద ఉన్న రాఘవ లైఫ్ సైన్స్ కెమికల్ ల్యాబ్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. రెండేళ్ల కిందట ఫ్యాక్టరీలో రియాక్టర్ పేలి పలువురు కార్మికులు గాయపడ్డా వారి గురించి పట్టించుకోలేదన్నారు. ఫ్యాక్టరీ నుంచి విడుదల అవుతున్న రసాయనాలు పంట పొలాల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆధ్యాత్మికం

- **సామూహిక సత్యనారాయణ వ్రతం**



నిజాంసాగర్: మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి అంజనేయస్వామి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బురి సాయిలు, స్థానికులు విఠల్‌రెడ్డి, రాంరెడ్డి, పండరి, విఠల్‌గౌడ్ పాల్గొన్నారు.

- **మహాగణపతి యజ్ఞం**



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని దేవునిపల్లి విద్యుత్ నగర్ శ్రీగౌరీ శంకర ఆలయంలో మహాగణపతి యజ్ఞం నిర్వహించారు. కాలనీకి చెందిన పలువురు దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నంగునూరి కిరణ్‌కుమార్, కార్యదర్శి గోపు వెంకటేష్, ప్రతినిధులు కృష్ణమోహన్, బస్వాగౌడ్, బ్రహ్మచారి, మల్లేష్, బాలరాజు, కృష్ణాగౌడ్ పాల్గొన్నారు.

- **పోచమ్మకు బోనాలు**



నిజాంసాగర్: మండలంలోని గాలీపూర్ గ్రామానికి చెందిన పలువురు మహిళలు శుక్రవారం రాత్రి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ముత్యాల పోచమ్మకు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మారెడ్డి నాయకులు శీలం సాయిలు, సాయిబాబ, వినోద్ సేట్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

- **శబరి మాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు**



తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శబరి మాత ప్రతిమ, దివ్యసమాధిని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు.

- **ఆలయ అభివృద్ధికి విరాళాలు**

భిక్కనూరు/మాచారెడ్డి: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ఉన్న పురాతన వెంకటేశ్వరాలయం అభివృద్ధికి తిప్పాపూర్‌కు చెందిన తిరుపరి హరిశ్చంద్రారెడ్డి, భిక్కనూరుకు చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేశ్, బోడ నర్సింలు విరాళాలు అందజేశారు. అదేవిధంగా మాచారెడ్డి మండలం చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి సదాశివనగర్ మండలం భూంపల్లికి చెందిన ఇదులాయి స్వామి, గోదావరి దంపతులు విరాళం ఇచ్చారు.

- **ముగిసిన శ్రీరామ నవమి ఉత్సవాలు**



కామారెడ్డి రూరల్: కామారెడ్డి రైల్వేస్టేషన్ ఆవరణలో శ్రీరామనవమి ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 62వ వార్షికోత్సవం సందర్భంగా భగవద్గీత బోధించిన రామకోటి జప లిఖిత ప్రచారకుడు క్రిష్ణానంద స్వామిని కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు డాక్టర్ ఎస్ శ్రీనివాస్, సుదర్శన్, కె రాజేశ్వర్‌రావు, వై సుదర్శన్, జీ శ్రీనివాస్, రైల్వే మాస్టర్ సత్యం పాల్గొన్నారు.

సంక్షిప్తం

బొమ్మ బొరుసు స్థావరంపై పోలీసుల దాడి

రాజంపేట: మండలంలోని తలమడ్ల గ్రామ శివారులో బొమ్మబొరుసు ఆడుతున్న స్థావరం ఎస్సై రాజు సిబ్బందితో కలిసి దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 9 బైకులు, 7 మొబైల్ ఫోన్లు, రూ.14,620 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఏబీవీపీ ఎస్‌ఎఫ్‌డీ మెంబర్‌గా నియామకం

కామారెడ్డి టౌన్: ఏబీవీపీ ఎస్‌ఎఫ్‌డీ మెంబర్‌గా కామారెడ్డికి చెందిన భానుప్రసాద్ ఎన్నికయ్యారు. ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌డీ జాతీయ మహాసభలో ఎన్నుకున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో బలగం సినిమా ప్రదర్శన

పెద్దకొడప్‌గల్: బలగం సినిమా చూసి అన్ని కుటుంబాలు కలిసి మెలసి ఉండాలని సర్పంచ్ తిర్మల్ రెడ్డి అన్నారు. పెద్దకొడప్‌గల్‌లో శనివారం ఉచితంగా సినిమాను ప్రదర్శించారు.

సదాశివనగర్: మండలంలోని వజ్జపల్లి, పద్మాజివాడి, ఉత్తునూర్ గ్రామాల్లో బలగం సినిమాను ప్రదర్శించినట్లు సర్పంచ్‌లు ఎర్రం నర్సయ్య, మడిపెద్ది కవిత, మోతె సాయవ్వలు తెలిపారు. సినిమాను తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చినట్లు వెల్లడించారు.

ప్రశాంతంగా పది పరీక్షలు



బాన్సువాడ టౌన్: బాన్సువాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి పరిశీలించారు. పరీక్షలు నిర్వహించే సమయంలో 144 సెక్షన్ అమలుల్లో ఉంటుందని ఆయన వెల్లడించారు.

రాజంపేట: మండలంలోని పరీక్ష కేంద్రాలను ఎంఈవో రామస్వామి, ఎస్సై రాజు తనిఖీలు చేపట్టారు. రెండు పరీక్ష కేంద్రాల్లో 397 విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈవో తెలిపారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి


నర్సరీలో ఉన్న మొక్కలను పరిశీలిస్తున్న సీసీఎఫ్ సైదులు

నాగిరెడ్డిపేట: అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్) సైదులు ఆదేశించారు. మండలంలోని మాల్తుమ్మెదలో ఏర్పాటు చేసిన నర్సరీని శనివారం ఆయన పరిశీలించారు. వాటి నిర్వహణ తీరుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంతకుముందు తాండూరు శివారులో ఏర్పాటు చేస్తున్న ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎఫ్‌డీవో గోపాల్‌రావు, నాగిరెడ్డిపేట ఎఫ్‌ఆర్‌వో వాసుదేవ్, డీఎఫ్‌ఆర్‌వో రవికుమార్, బీట్ అధికారులు నాగరాజు, భూపతి, నవీన్ ఉన్నారు.